క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సదుపాయాలు



పటమట(విజయవాడతూర్పు): నగరంలో నిరంతరం శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికుల కోసం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకోసిస్టమ్(నమస్తే) నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన వీఎంసీ అసిస్టెంట్ మెడికల్ అధికారి డాక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, ఆయుష్మాన్ కార్డులు అందజేశారని, వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సోమరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ పురస్కారానికి గడువు పొడిగింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 20వ తేదీ వరకూ గడువును పొడిగించినట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ పురస్కారం -2025కు ఉపాధ్యాయులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పది సంవత్సరాల సర్వీస్ కలిగిన ఉపాధ్యాయులు అర్హులని చెప్పారు. ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, దానిని ఈ నెల 20వ తేదీ వరకూ పొడిగించినట్లు తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల ఉప తనిఖీ అధికారి, ఉర్దూ రేంజ్ అధికారులు ఈ అంశాన్ని అందరికీ తెలియజేసి ప్రచారం కల్పించాలని కోరారు.

యూపీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని కండ్రిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో బుధవారం ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాల కోసం వచ్చిన తల్లీబిడ్డ వద్దకు వెళ్లి ఆమె వద్ద ఉన్న మాతా శిశు కార్డు తీసుకుని బీసీజీ టీకా మొదలుకొని ఇప్పటి వరకూ వేయించాల్సిన అన్ని టీకాలు వేశారో లేదో పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో సేవలు పొందాల్సిన శిశువుల డ్యూ లిస్ట్‌ను పరిశీలించారు. రోగులకు ఈహెచ్‌ఆర్, ఏబీహెచ్‌ఏ ఐడీలు నమోదు చేస్తున్నారా అని డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్దకు వెళ్లి సిస్టమ్‌ను తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాల నిర్వాహణలో ప్రగతి సాధించాలని వైద్యాధికారి ఆదేశించారు. కార్యక్రమంలో ఈ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిహారిక, సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

నాసా కాంటెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నాసా(ఎన్ఏఎస్ఏ) ప్రాజెక్టుల కాంటెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి ప్రతిభ చూపినట్లు అశోక్‌నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ రంజని తెలిపారు. హీలియస్ ఎక్స్‌ట్రాక్టస్‌లో ప్రథమ బహుమతి, హెల్త్ ఇన్ స్పేస్‌లో ద్వితీయ బహుమతిని కై వసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం అభినందిస్తూ షీల్డ్ అండ్ గోల్డ్ మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎకడమిక్ జీఎం మురళీకృష్ణ, ఆర్ఐ పద్మ, కో–ఆర్డినేటర్ చక్రధర్, డీన్ గోపాలరావు, సి–ఇన్‌చార్జి వీరబాబు, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, నాసా ఇన్‌చార్జి హేమ పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మిక వాడలోని విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారులు 38 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 124 కేసులకు గాను రూ.4.08 లక్షలు జరిమానా విధించామన్నారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ సంప్ హౌస్

- కొన్నేళ్లుగా వ్యర్థాలతో నిండి నిరుపయోగంగా ఉన్న సంప్
- మురుగునీటిపై వేసిన ఐరన్ మెష్ ధ్వంసం
- ప్రమాదవశాత్తూ సంప్‌లో పడితే గల్లంతే

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థకు చెందిన డ్రెయినేజీ సంప్ హౌస్ గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంటోంది . మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమకు సంబంధించిన భవనాలు, ఆస్తులను కాపాడుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న నిరర్థక ఆస్తుల గురించి అసలు పట్టించుకోరు. అందుకు భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లో రీజనల్ సైన్స్ సెంటర్ పక్కన ఉన్న డ్రెయినేజీ సంప్ హౌస్ నిదర్శనం. కృష్ణా పుష్కరాల ముందు వరకు కరకట్ట సౌత్ రోడ్‌లో (పున్నమి హోటల్ నుంచి ఎస్ఎంఎస్ ఖుద్దూస్ మున్సిపల్ హైస్కూల్ వరకు) కృష్ణానదీ తీరాన వందలాది చిన్నపాటి నివాసాలు ఉండేవి. ఆ సమయంలో అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ పక్కన గల స్థలంలో నగరపాలక సంస్థ డ్రెయినేజ్ సంప్ హౌస్ నిర్మించింది. కృష్ణా పుష్కరాల (2016) సమయంలో కృష్ణానదీ తీరాన రివర్ ఫ్రంట్ అభివృద్ధి పేరుతో నివాసాలన్నింటిని తొలగించి వారికి ప్రత్యామ్నాయంగా జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఇళ్లు కేటాయించారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కుమ్మరించి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేశారు. ఆ తరువాత అభివృద్ధి చేసిన స్థలాన్ని ప్రజాప్రయోజనాలకు వాడకుండా గాలికి వదిలేశారు.



కరకట్ట రోడ్డు పక్కన నిరుపయోగంగా ఉన్న డ్రెయినేజీ సంప్ హౌస్

వ్యర్థాలతో నిండిపోయిన సంప్

కట్ట కింద పేదల ఇళ్లన్నీ తొలగించిన నాటి టీడీపీ ప్రభుత్వం డ్రెయినేజీ సంప్ హౌస్‌ను మాత్రం తొలగించలేదు. అది ప్రభుత్వానికి సంబంధించింది కాబట్టి దాన్ని అలా వదిలేశారు. అప్పటి నుంచి అలానే ఉన్న సంప్ హౌస్ ప్రస్తుతం ప్రమాదకరంగా తయారయ్యింది. సంప్ ముందు భాగంలో ఉన్న ఖానాలపై ముందు జాగ్రత్తగా వేసిన ఐరన్ మెష్ మొత్తం ధ్వంసమై ఉంది. ఖానాల్లోని డ్రెయినేజ్ వాటర్ ఖాళీ వాటర్ బాటిల్స్ వంటి అనేక వ్యర్థాలతో నిండిపోయింది. సంప్ హౌస్ లోపల కూడా మురుగు నీరు స్టాగ్నెట్ అయిపోయి దుర్వాసన కొడుతోంది. సంప్ హౌస్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో స్థానిక యువకులు క్రికెట్ ఆడుకుంటూ ఉంటారు. ఆటలో భాగంగా బాల్ సంప్ వైపు గానీ లేదా ఖాళీగా ఉన్న సంప్ ఖానాల్లోని మురుగు నీటిలోనైనా పడే అవకాశం ఉంది. పొరపాటున బాల్ నిల్వ ఉన్న మురుగునీటిలో పడితే దానిని తీసుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు దానిలో ఎవరైనా పడిపోతే ఇక గల్లంతే. జరగరానిదేదైనా జరిగితే అందుకు ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



చెత్త, వ్యర్థాలతో సంప్ హౌస్ భవనం ముందున్న ఖానాలు



కరకట్ట రోడ్డు పక్కన నిరుపయోగంగా ఉన్న డ్రెయినేజీ సంప్ హౌస్

డ్రెయినేజ్ సంప్ హౌస్‌ను తొలగించాలి

నిరుపయోగంగా, ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజీ సంప్ హౌస్‌ను వెంటనే తొలగించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. సంప్ హౌస్ తలుపులు కూడా తీసే ఉంటున్నాయని, ఆడుకునే యువకులు లోపలకు వెళితే అక్కడ లోతుగా చాలా కాలంగా నిల్వ ఉన్న మురుగునీటిలో పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోపలకు వెళుతున్న విషయాన్ని ఎవరైనా చూస్తే తప్ప పడిపోయిన సంగతి కూడా ఎవరికీ తెలిసే అవకాశం ఉండదు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో నదిలో స్నానాలు చేసేందుకు వచ్చే భక్తులు కూడా సంప్ హౌస్ లోపలకు వెళ్లే ప్రమాదం ఉంది. నగర పాలక సంస్థలో సంప్‌ల నిర్వహణ చూసే అధికారులు గానీ, సూపర్‌వైజర్లు గానీ ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న డ్రెయినేజ్ సంప్ హౌస్ గురించి పట్టించుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైఎస్సార్ విగ్రహ తొలగింపు నిర్ణయాన్ని విరమించుకోండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అంబటి నాగరాధాకృష్ణ యూనివర్సిటీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బుధవారం జరిగిన యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో విగ్రహం తొలగింపు విషయం ఏజెండాలో ఒక అంశంగా ఉండటంతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం ఎదుట కొద్దిసేపు నిరసన తెలియజేశారు. వైద్య రంగాన్ని ఎంతో అభివృద్ధి చేయడంతోపాటు, రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహం తొలగింపు సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సొంగా రాజ్‌కమల్, పోలిమెట్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఐదేళ్లు పాటుబడి బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు మూలపాడు గ్రామస్తులు బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. మూలపాడు గ్రామ ప్రజల తరఫున శాలువా కప్పి మెమొంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. వీరు ఎక్కడున్నా విధి నిర్వహణలో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని స్థానికులు మూరకొండ నాగేశ్వరరావు, మాకాని వెంకాయమ్మ, జొన్నలగడ్డ సురేంద్ర తెలిపారు.

మధ్యవర్తిత్వంతో సత్వర పరిష్కారం

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేందుకు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. న్యాయస్థానాల్లో దశాబ్దాలుగా విచారణలో పేరుకుపోయిన కేసులను సత్వర పరిష్కారం చేసి కక్షిదారులకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టు మీడియేషన్, కౌన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ వారి ఆదేశించింది. ఈ ఆదేశాలతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సూచనల మేరకు ర్యాలీ చేపట్టారు. నగరంలోని కోర్టు కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం మీదుగా తిరిగి కోర్టు కాంప్లెక్స్‌కు ర్యాలీ చేరింది. ఈ సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ గైడెన్స్ తెలియపరచడం కోసం రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక సభ నిర్వహించారు.

సెప్టెంబర్ 30 వరకు నిర్వహణ..

ఈ సభలో 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. కోర్టు తీర్పుకి మీడియేషన్ తీర్పుకు చాలా తేడా ఉందని, కోర్టు తీర్పులో ఒక వైపు గెలుపు, మరో వైపు ఓటమి ఉంటుందన్నారు. అదే మధ్యవర్తిత్వంలో అయితే ఇరువురికి విజయం ఉంటుందని తెలియజేస్తూ, ఇది ఎంతో మంచి ఉద్దేశంతో నేషనల్ సర్వీసు అథారిటీ సూచించినందున కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 30 వరకు జరుగుతుందని తెలిపారు. సీనియర్ మీడియేషనర్ వేములు హాజరతయ్య గుప్తా, వి.రాజారత్నం, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, 13వ అదనపు జిల్లా జడ్జి డి.శేషయ్య, చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బి.రాధారాణి, 7వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ఎల్ శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు సాయంత్రం కోర్టు ప్రాంగణం నుంచి బందర్ రోడ్డు, పోలీసు కమిషనర్ ఆఫీసు మీదుగా బైక్ ర్యాలీ నిర్వహిస్తూ మీడియేషన్ ఆవశ్యకతను తెలియపరుస్తూ నినాదాలు చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



ఆండ్రాయిడ్ ప్రాజెక్టుల ప్రదర్శనను పరిశీలిస్తున్న కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ తమ రంగాల్లో వస్తున్న ఆవిష్కరణలపై పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ తెలిపారు. ఆ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ విద్యార్థులు రూపొందించిన ఆండ్రాయిడ్ ప్రాజెక్టుల ప్రదర్శన ఆ కళాశాల సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శనను ప్రారంభించిన చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చాలా వేగవంతమైన ప్రగతి చోటు చేసుకుందన్నారు. ఆ క్రమంలో కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన అభ్యున్నతి పరుగులు తీస్తోందన్నారు. ఆ రంగానికి సంబంధించిన విద్యార్థులు నూతన ఆవిష్కరణలను తెలుసుకుని వాటికి అనుబంధంగా మరిన్ని నమూనాలను ముందుకు తీసుకురావాలన్నారు. ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. తమలోని సృజనాత్మకతకు పదును పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ అక్బర్, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

భారాలు వేసేందుకే అదాని మీటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజలకు పెనుభారం కానున్న స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని సీపీఎం పశ్చిమ కార్యదర్శి బోయి సత్యబాబు అన్నారు. ప్రజలపై విద్యుత్ భారాలు వేసి, అదానికి లాభాలు చేకూర్చేందుకే విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లపై సీపీఎం పోరుబాటలో భాగంగా ఆ పార్టీ పశ్చిమ కమిటీ ఆధ్వర్యంలో గాంధీహిల్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బోయి సత్యబాబు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచుతూ అదాని స్మార్ట్ మీటర్లు బిగించడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించకుండా ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలపై భారాలు వేసే విద్యుత్ విధానాలను ఆపాలని, లేదంటే 2000వ సంవత్సరంలో విద్యుత్ ఉద్యమం మాదిరిగా 2025 ఆగస్టులో మరో విద్యుత్ ఉద్యమానికి ప్రజలు సిద్ధమవాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో స్మార్ట్ మీటర్ల విచిత్ర వేషధారణ ఆకట్టుకుంది. సీపీఎం నాయకులు గాదె ఆదిలక్ష్మి, సూరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువెళుతున్న శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణ మూర్తి . శ్యామల దంపతులు, భక్తులు



అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన మహిళా సంఘం ప్రతినిధులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో స్వయంభూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణమూర్తి, శ్యామల దంపతుల ఆధ్వర్యాన ఇంద్రకీలాద్రిపై కొలువైన లోకమాత దుర్గాదేవికి బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. తొలుత శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు పసుపు, కుంకుమ, పువ్వులు, పండ్లు, గాజులు, వివిధ రకాల స్వీట్లతో దేవాలయంలోని రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణం నుంచి మధురానగర్ పుర వీధులో మేళతాళాలతో అంగరంగా వైభవంగా ఊరేగించారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకుని శ్రీ కనకదుర్గమ్మకు ఆషాడ సారె సమర్పించారు. అనంతరం అమ్మవారి ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆషాఢం సారె

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆషాఢం సారెను సమర్పించారు. సంఘ అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో పలువురు మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. తొలుత అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తిని దర్శించుకుని పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించారు. సంఘం ఆధ్వర్యంలో గత 8 ఏళ్లుగా ప్రతి ఏటా ఆషాఢంలో అమ్మవారికి సారెను సమర్పిస్తున్నామని, రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అమ్మవారి దయతో పాడి పంటలు, చేతివృత్తులతో అందరూ సంతోషంగా ఉండేలా దీవించమని అమ్మవారిని వేడుకున్నామని శ్రీవాణి తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, సింహాద్రి కనకాచారి, మహిళా సంఘం నేతలు విజయలక్ష్మి, హేమలత, జగదీశ్వరి, చైతన్య, పాల్గొన్నారు.

అక్రమ వెంచర్ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు



చంద్రగూడెంలో చేపట్టిన అక్రమ వెంచర్ నిర్మాణాలు

మైలవరం: చంద్రగూడెం గ్రామంలో అనుమతులు లేకుండా కొంతమంది అక్రమార్కులు వెంచర్ నిర్మాణం చేపట్టారు. ఈ విషయం పంచాయతీ అధికారుల దృష్టికి రావడంతో బుధవారం దాని నిర్మాణాన్ని నిలిపివేశారు. చంద్రగూడెంలో సర్వే నంబర్లు 386/1ఏ, 389/2ఏ, 97/1ఏ లో 16 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో సీఆర్‌డీఏ అనుమతి లేకుండా కొంతమంది ప్లాట్లుగా విభజించి గ్రావెల్‌తో రహదారులు ఏర్పాటు చేస్తుండగా చంద్రగూడెం పంచాయతీ కార్యదర్శి మీరా సాహెబ్, వీఆర్‌ఓ, సిబ్బంది అక్రమ లేఅవుట్ వద్దకు చేరుకుని అనుమతి పత్రాలు చూపించాల్సిందిగా తెలియజేశారు. దీనితో వారు అనుమతి పత్రాలు చూపించలేకపోయారు. సీఆర్‌డీఏ అనుమతి ఉన్నా స్థానిక పంచాయతీ కార్యాలయానికి కనీస సమాచారం ఇవ్వకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి పత్రాలు, పొలానికి సంబంధించిన కాగితాలను పంచాయతీ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. దీనితో ట్రాక్టర్‌లు, డ్రోజర్లు, టిప్పర్‌లతో చేస్తున్న పనులు నిలిపివేశారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



చెవుటూరులో నీటి కోసం నిరసన తెలుపుతున్న మహిళలు

జి.కొండూరు: పదిరోజులుగా వాడుక నీరు లేక నరకయాతన పడుతున్నామంటూ చెవుటూరులోని లొద్ది ప్రాంతంలో మహిళలు బుధవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. తమ వీధిలో యాభై కుటుంబాల వరకు ఉండగా గత పది రోజులుగా గ్రామ పంచాయతీ కుళాయిల్లో నీరు రావడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చుక్కనీరు లేక తాగేందుకు తెచ్చుకున్న కృష్ణా వాటర్‌నే ఇంటి అవసరాలకు వాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్నానం చేసేందుకు కూడా నీళ్లులేక పిల్లలను కొన్ని రోజులుగా స్కూళ్లకు కూడా పంపడంలేదని చెప్పారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్న కుటుంబాలు నరకయాతన పడుతున్నారని తెలిపారు. చేసేది లేక మినరల్ వాటర్ కొనుగోలు చేసి ఇంటి అవసరాలకు వాడుతున్నామని వాపోయారు. గ్రామంలో రెండు బోర్లు ఉన్నా మోటార్ల కెపాసిటీ సరిపోక గ్రామం అంతటికీ సక్రమంగా నీటి సరఫరా కావడంలేదని ఆరోపించారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తమ గోడు వినడంలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరారు.

21 నుంచి ఫార్మసీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్(ఐపీఏ) సహకారంతో నగరంలోని కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల్లో ఈ నెల 21 నుంచి 27 వరకూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఏ సునీత తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం సునీత మాట్లాడుతూ ఔషధ కంపెనీకి, ఔషధ పంపిణీ గురించి లోతైన అవగాహన కోసం జాతీయ స్థాయి నిపుణులతో అధ్యాపకులకు ఈ వర్క్‌షాపులో అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా సుస్థిరమైన ఔషధ పంపిణీకి నూతన టెక్నాలజీలను, పరికరాలు, వ్యూహాలను ఉపాధ్యాయులకు అందించడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఫార్మాస్యూటిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి రమణ తదితరులు పాల్గొన్నారు.